## జాతీయ స్థాయిలో సీఎంఏ క్యాట్ పరీక్షలో ఆల్ ఇండియా 5వ ర్యాంకు సాధించిన వంజరపు దీపక్



**ఉంగుటూరు, పెన్ సత్తా, జులై 17::**ఉంగుటూరు మండలం బాదంపూడికి చెందిన వంజరపు దీపక్ జాతీయ స్థాయిలో నిర్వహించిన సీఎంఏ క్యాట్ అర్హత పరీక్షలో ఆల్ ఇండియా 5వ ర్యాంకు సాధించి విశేష ప్రతిభ కనబరిచారు. అకౌంటింగ్, ఫైనాన్స్, ట్యాక్సేషన్, బిజినెస్ కాస్ట్ అకౌంటింగ్ రంగాల్లో కెరీర్ ప్రారంభించాలనుకునే విద్యార్థుల కోసం నిర్వహించే ఈ అర్హత పరీక్షను ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా నిర్వహిస్తుంది.

దీపక్ సాధించిన ఈ అరుదైన విజయంతో ఆయన చదువుతున్న విద్యాసంస్థతో పాటు తల్లిదండ్రులు, స్వగ్రామం బాదంపూడికి ప్రత్యేక గుర్తింపు లభించింది. ఆయన ప్రతిభపై తణుకులోని విద్యాసంస్థ యాజమాన్యం, అధ్యాపకులు, తోటి విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

ఈ సందర్భంగా శుక్రవారం నారాయణపురంలోని క్యాంపు కార్యాలయంలో ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు దీపక్‌ను అభినందించి, భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. గ్రామీణ ప్రాంతానికి చెందిన విద్యార్థి జాతీయ స్థాయిలో ఈ ఘనత సాధించడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

దీపక్‌ను అభినందించిన వారిలో శరణాల మాలతీరాణి, అడపా శోభారాణి తదితరులు ఉన్నారు.

### జగదాంబ అమ్మవారి ఆలయం ఉన్నచోటే పునర్ నిర్మించాలి



**జీలుగుమిల్లి,, పెన్ సత్తా, జులై 17:;** స్థానిక శ్రీ జగదంబ అమ్మవారి ఆలయం ఉన్నచోటే నూతన పునర్నిర్మాణం చేపట్టాలని గ్రామస్తులు, గ్రామ పెద్దలు తీర్మానించారు. శుక్రవారం దేవాదాయశాఖ ఈవో టి లక్ష్మి, శ్రీ మద్ది ఆంజనేయ స్వామి ఆలయం సూపర్డెంట్ కే రంగారావు ఆధ్వర్యంలో ఆలయ నిర్మాణం విషయమై ఏర్పాటు చేసిన గ్రామసభలో గ్రామస్తులు ,గ్రామ పెద్దలు తన తీర్మానాన్ని తెలియజేశారు. అమ్మవారి ఉత్సవాలు 69 సంవత్సరాలుగా అంగరంగ వైభవంగా నిర్వహిస్తూ వస్తున్నారని అధికారులకు విన్నవించారు. అమ్మవారిని వేరేది చోటకు తరలించి ఆలయం నిర్మించడం అంటే గ్రామస్తులకు తీవ్ర మనోవేదన మిగల్చడమే అవుతుందని గ్రామస్తులు, గ్రామ పెద్దలు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ప్రస్తుతం ఉన్న ఆలయం చోట నూతన ఆలయాన్ని నిర్మిస్తే అందరికీ ఆమోదయోగ్యం అవుతుందని సంతకాల సేకరణతో పేర్కొన్నారు. ఈ సందర్భంగా దేవాదాయ శాఖ ఆలయ ఈవో టి లక్ష్మి మాట్లాడుతూ గ్రామస్తులు సూచించిన విషయాలను ఉన్నత అధికారులకు నివేదిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు ఆలయ కమిటీ చైర్మన్ చిర్రి వెంకటేశ్వరరావు, గడ్డ మణుగు సత్యనారాయణ, చాట్రాతి ప్రసాద్ చాట్రాతి భవాని శేఖర్,కోరుకొండ జనార్దన్ రావు, కోరుకొండ రామకృష్ణ, కోరుకొండ సూరిబాబు, కక్కిరాల చక్రి, గ్రామస్తులు పాల్గొన్నారు.

## జిల్లా వైసీపీ కార్యాలయంలో ముద్రగడ పద్మనాభం నివాళులు



**రాజమహేంద్రవరం, పెన్ సత్తా, జులై 17:::**కాపు ఉద్యమనేత,మాజీ మంత్రి వర్యులు ముద్రగడ పద్మనాభం మృతి పార్టీకి తీరని లోటని వై సి పి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షులు చెల్లుబోయిన వేణు గోపాలకృష్ణ అన్నారు. వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ రాజమండ్రి రూరల్ నియోజకవర్గం జిల్లా పార్టీ కార్యాలయంలో శుక్రవారం ముద్రగడ పద్మనాభం చిత్రపటానికి రూరల్ నియోజకవర్గం నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళుల ర్పించారు.ముద్రగడ కుటుంబానికి అండగా ఉంటామని వై.యస్ జగన్ భరోసా ఇవ్వడం ఆ కుటుంబంతో ఆయనకు ఉన్న అనుబంధాన్ని గుర్తు చేశారు. సిద్ధాంత బద్దంగా అలుపెరగక పోరాడిన నాయకుడిగా ముద్రగడ చరిత్రలో నిలుస్తారని అన్నారు.అంత్యక్రియలలో రాజకీయాలు చేయాలని చూసిన కూటమి ప్రభుత్వం పై రాష్ట్ర కాపు జాతి ప్రజలు తగిన బుద్ధి చెప్తారన్నారు.ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు నక్క రాజబాబు, గిరిజాల బాబు యాదల స్టాలిన్, ముద్దాల అను, బొప్పన సుబ్బారావు ఆచంట కళ్యాణ్ డబ్బింగ్ రమేష్ తాడాల చక్రవర్తి, తిరుమలశెట్టి శ్రీను,చాప రాజా రుక్యా సయ్యద్ సింహాద్రి రామలక్ష్మి షేక్ సమీరా కేపీ నాయుడు,దాసరి శివ, చొల్లంగి సత్యగిరి కొల్లి వెంకటరత్నం దాసరి ధర్మ ఓదురి రామకృష్ణ, ,అరిగేలా భాష కుప్పల రాంబాబు కోటిపల్లి రవి కాతేటి ఏసు, జల సత్యనారాయణ, సాక సతీష్,సంగీత రవితేజ,ఆకుల సుధాకర్, జీ.పీ.ఆర్ నాయుడు, కామిరెడ్డి పెద్ద కాపు, చేదులూరి ,ఉలిమి నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు

# రోడ్డు ప్రమాదంలో మరణించిన కార్యకర్త కుటుంబానికి అండగా టిడిపి

ఎమ్మెల్యే పరిటాల సునీత చేతుల మీదుగా 5లక్షల ప్రమాద బీమా పత్రం అందజేత



**ధర్మవరశీ,జూలై 17 (పెన్ సత్తా)** రోడ్డు ప్రమాదంలో మరణించిన పార్టీ కార్యకర్త కుటుంబానికి తెలుగుదేశం పార్టీ అండగా నిలిచింది. కనగానపల్లి మండలం ముక్తాపురం పంచాయతీ పర్వతదేవరపల్లి గ్రామానికి చెందిన బాబు సాహెబ్ షేక్ 2 నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో మరణించారు.గ్రామ సమీపంలోని జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ బాబు సాహెబ్ మరణించారు.బాబు సాహెబ్ యుక్త వయసు నుంచి తెలుగుదేశం పార్టీ కార్యకర్తగా ఉన్నారు. ఆయనకు పార్టీ సభ్యత్వం ఉన్న విషయాన్ని ఎమ్మెల్యే సునీత దృష్టికి తీసుకెళ్లారు.వెంటనే ఎమ్మెల్యే ప్రమాద బీమా కోసం దరఖాస్తు చేయించారు.పార్టీ అధిష్టానం ఐదు లక్షల రూపాయల ఇన్సూరెన్స్ మంజూరు చేయించింది. అనంతపురం క్యాంప్ కార్యాలయంలో బాబు సాహెబ్ భార్య రహీంబికి ఎమ్మెల్యే సునీత ప్రమాద బీమా పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ,మండల నాయకులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే పరిటాల సునీతతో పాటు జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ కు బాధిత కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.ఒక పార్టీ కార్యకర్తకు ఇంతగా అండగా నిలబడే ఏకైక పార్టీ ఒక తెలుగుదేశం మాత్రమేనని ఎమ్మెల్యే సునీత అన్నారు. వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ చొరవతోనే ఇలా కార్యకర్తలకు సాయం అందుతోందన్నారు.

# జిల్లా పరిషత్ సమావేశంలో కంచిలి సమస్యలపై విజ్ఞప్తి.



ఎంపీపీ దేవదాసు రెడ్డి

**కంచిలి పెన్ సత్తా, జులై 17:**జిల్లా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన సర్వసభ్య సాధారణ సమావేశంలో కంచిలి మండల ప్రజలకు సంబంధించిన పలు కీలక సమస్యలను మండల పరిషత్ అధ్యక్షుడు (ఎంపీపీ) పైల.దేవదాస్ రెడ్డి ప్రస్తావించారు.సాగునీటి సౌకర్యాలు,రైతులకు సబ్సిడీపై వ్యవసాయ పరికరాల పంపిణీ,ఓటరు జాబితా సవరణలో లోపాలు తదితర అంశాలపై అధికారుల నుంచి సమాధానం కోరుతూ తక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. గంగాసాగరం వద్దదెబ్బతిన్న షట్టర్ల స్థానంలో కొత్త షట్టర్లు ఏర్పాటుచేయాలని,పైడిగాం ఆయకట్టు వద్ద తాత్కాలిక మరమ్మతులు చేపట్టి సాగునీటి సమస్యలు తలెత్తకుండా చూడాలని కోరారు.వర్షాకాలం నేపథ్యంలో ఈ పనులను అత్యవసరంగా చేపట్టాలని సూచించారు.వ్యవసాయ రంగానికి సంబంధించి కూటమి ప్రభుత్వంఏర్పడిన తర్వాత ఇప్పటివరకు రైతులకు సబ్సిడీపై ట్రాక్టర్లు, నూర్పు యంత్రాలు,దమ్ము, దుక్కి సెట్లు,స్ప్రేయర్ పంపులు తదితర వ్యవసాయ పనిముట్లు పంపిణీ చేయలేదని పేర్కొన్నారు.ఈ సీజన్‌లో రైతులకు వాటిని అందజేస్తారా లేదా అనే విషయంపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా కంచిలి మండల ఏఈఆర్‌వో (తహసీల్దార్), బీఎల్‌వోలు, బీఎల్ఏలతో మరోసారి సమీక్ష సమావేశం నిర్వహించాలని కోరారు. ఏఈఆర్‌వో పనితీరుపై ఇప్పటికే జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన విషయాన్ని సభ దృష్టికి తీసుకువచ్చారు.

అలాగే పెద్ద శ్రీరాంపురం గ్రామపంచాయతీలో 11 మంది ఓటర్లకు ఎన్యుమరేషన్ ఫారాలు అందజేయకపోవడంతో వారి పేర్లు ఓటరు జాబితా నుంచి గల్లంతైన విషయంపై పూర్తి వివరాలు వెల్లడించి, తగిన చర్యలు తీసుకోవాలనిఅధికారులను కోరారు.కంచిలి మండల ప్రజలకు సంబంధించిన సమస్యల పరిష్కారంలో అధికారులు ప్రత్యేక దృష్టి సారించి, త్వరితగతిన చర్యలు చేపట్టాలని ఎంపీపీ పైల.దేవదాస్ రెడ్డి సమావేశంలో విజ్ఞప్తి చేశారు.

## ఒక నెల' ఒక నియోజకవర్గం' నాలుగ సందర్శనలు' కార్యక్రమానికి విశేష స్పందన




**కె కోటపాడు, పెన్ సత్తా, జులై 17::** 'ఒక నెల, ఒక నియోజకవర్గం, నాలుగు సందర్శనలు' కార్యక్రమానికి విశేష స్పందన లభించింది మండల కేంద్రం కోటపాడు రామకృష్ణ ఫంక్షన్ హాల్లో 'ఒక నెల, ఒక నియోజకవర్గం, నాలుగు సందర్శనలు' కార్యక్రమం నిర్వహించారు. శాసనసభ్యులు బండారు సత్యనారాయణమూర్తి, జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, ఇతర అధికారులు, నేతలు పాల్గొని, మాడుగుల నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి పెద్ద సంఖ్యలో వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న కార్యక్రమంలో మండలాలవారీగా ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి, ప్రజల ససమ్యలను సావధానంగా విని, అర్జీలు స్వీకరించి, వాటిని కంప్యూటర్లో క్రోడీకరించి దాని ప్రతిని ఇచ్చారు. ఆయా ప్రతులను జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యేల దగ్గరకు తీసుకెళ్లి, సమర్పించడంతోపాటు సమస్యను అధికారులు, నేతలకు చెప్పుకునే వీలు కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ విజయ కృష్ణన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఈ కార్యక్రమాన్ని ప్రజలు వాటిని సద్వినియోగం చేసుకోవాలని, ఎవరికి ఎలాంటి సమస్య వచ్చినా స్వచ్ఛందంగా వచ్చి అధికారులకు నివేదించవచ్చునని కలెక్టర్ అన్నారు. ప్రతి సమస్యకు పరిష్కార మార్గం దొరుకుతుందని భరోసానిచ్చారు. మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ముందు చూపుతో నియోజకవర్గాల్లో ఏ గ్రామంలో ఎలాంటి సమస్యలు ప్రజలకు రాకుండా ఉండేందుకు ఈ ప్రత్యేక కార్యక్రమం రూపొందించారని, ఆయా సమస్యలకు కార్యక్రమంలో పరిష్కారం దొరుకుతుందన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో ఆయేషా, తదితర ముఖ్య అధికారులతో పాటు, కొప్పుల వెలమ కార్పొరేషన్ చైర్మన్ పీవీజీ. కుమార్, మాడుగుల మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు అర్జీలను పరిశీలించి సంబంధిత అధికారులకు నివేదించారు.

## లక్ష్మీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో " అభయ" మహిళల భద్రతపై అవగాహన కార్యక్రమం....





ఎస్ఐ బి.నాగ కార్తీక్....

**చోడవరం పెన్ సత్తా, జులై 17::**చోడవరం పోలీసుల ఆధ్వర్యంలో "అభయ" కార్యక్రమంలో భాగంగా చోడవరం మండలంలోని లక్ష్మీపురం గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో మహిళలు, బాలికల భద్రత మరియు వారికి సంబంధించిన చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా చోడవరం ఎస్ఐ బి. నాగకార్తీక్ సుమారు 300 మంది విద్యార్థులకు మానవ అక్రమ రవాణా (హ్యూమన్ ట్రాఫికింగ్ ), యాసిడ్ దాడులు , కిడ్నాప్ మరియు అపహరణ , పని ప్రదేశాల్లో మహిళలపై వేధింపులు , బాల్య వివాహాలు , బహిరంగ ప్రదేశాల్లో వేధింపులు (పబ్లిక్ హరస్మెంట్ ), (ఏ ఐ అ డిజిటల్ క్రైమ్స్ ), గృహ హింస (డోమెస్టిక్ వైయలెన్స్ )తో పాటు మహిళలపై జరిగే నేరాలు, సైబర్ భద్రత మరియు సోషల్ మీడియా వినియోగంలో పాటించాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అలాగే అత్యవసర పరిస్థితుల్లో 112 ఎమర్జెన్సీ సేవలు మరియు మహిళల సహాయం కోసం 181 మహిళా హెల్ప్‌లైన్ను వినియోగించుకోవాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో లక్ష్మీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది మరియు సుమారు 450 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

# జనసేన నాయకులు కీలక సమావేశం.

**కవిటి పెన్ సత్తా, జులై 17:** రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని జనసేన పార్టీ కవిటి మండలంలోని 23 పంచాయతీల ఇంచార్జిలు,ముఖ్య నాయకులు,జనసైనికులతో శుక్రవారం కవిటి పట్టణంలో కీలక సమావేశం నిర్వహించింది.ఎన్నికల సన్నద్ధత,పార్టీ సంస్థాగత బలోపేతం,కూటమి ధర్మాన్ని పాటిస్తూ స్థానిక ఎన్నికల్లో అనుసరించాల్సిన కార్యాచరణపై విస్తృతంగా చర్చించారు. మండలంలోని ప్రతి పంచాయతీలో పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలని,కూటమి నిర్ణయాలకు కట్టుబడి ఎన్నికల్లో ముందుకు సాగాలని నాయకత్వం స్పష్టం చేసింది.గ్రామస్థాయిలో ప్రజలతో మరింత మమేకమై పార్టీ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని,కార్యకర్తలు ఐక్యంగా పనిచేసి పార్టీ విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.అదేవిధంగా,ఆయా పంచాయతీల రాజకీయ పరిస్థితులు,స్థానిక సమస్యలు,ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లపై నాయకుల నుంచి అభిప్రాయాలు సేకరించి, భవిష్యత్ కార్యాచరణకు సంబంధించిన దిశానిర్దేశం చేశారు. ప్రతి పంచాయతీలోపార్టీనిర్మాణాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు కార్యకర్తల సమన్వయానికి ప్రాధాన్యం

RNI:APTEL/2023/87729

## సంపాదకీయం

# నిరాహార నినాదం!


పరీక్ష పత్రాల లీకేజీలపై కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ప్రఖ్యాత శాస్త్రవేత్త, విద్యావేత్త సోనమ్ వాంగ్‌చుక్ చేపట్టిన నిరవధిక నిరాహార దీక్ష పదిహేడు రోజులు దాటింది. ఆయన ఆరోగ్యం క్షీణిస్తుండటంతో దీక్ష విరమించాలని విపక్ష నేతలు సైతం విజ్ఞప్తి చేస్తున్న వేళ -ఈ దీక్ష ఒక మంత్రి రాజీనామాతో ముగిసిపోకూడదని, విద్యారంగ ప్రక్షాళనకు జాతీయ జాగృతిగా మారాలని వాంగ్‌చుక్ సతీమణి చేసిన విన్నపం దేశ మనస్సాక్షిని తట్టిలేపుతోంది. వ్యక్తులు తాత్కాలికం, వ్యవస్థలే శాశ్వతమన్నది ఆమె వాదన సారాంశం. బట్టీ విద్యకు పట్టంగట్టే పరీక్షల ప్రక్షాళన, కోచింగ్ సంస్కృతి నిర్మూలన, ఉపాధ్యాయ ఉత్కృష్టతా మిషన్, ఖాళీ పోస్టుల సత్వర భర్తీ, ప్రభుత్వ బడులపై విశ్వాస పునరుద్ధరణ, అకడమిక్ స్వేచ్ఛ, జాతీయ విద్యా డాష్‌బోర్డ్, జీడీపీలో ఆరు శాతం విద్యా వ్యయం, ఎన్నికల చక్రాలకు అతీతమైన చట్టబద్ధ సంస్కరణల కమిషన్ -ఈ పది సంస్కరణలను ఆమె జాతి ముందుంచారు.

ఢిల్లీ వీధుల్లో ఒక మహోన్నత వ్యక్తి శరీరం రోజురోజుకూ శుష్కిస్తోంది. కానీ ఆయన లేవనెత్తిన ప్రశ్న మాత్రం దేశ మనస్సాక్షిని తట్టిలేపుతూ మరింత బలపడుతోంది. ప్రఖ్యాత శాస్త్రవేత్త, విద్యావేత్త, సంఘ సంస్కర్త సోనమ్ వాంగ్‌చుక్ నిరవధిక నిరాహార దీక్ష దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. పరీక్ష పత్రాల లీకేజీల వ్యవహారంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ప్రారంభమైన దీక్ష కొనసాగుతుంటే.. ఆయన ఆరోగ్యం క్షీణిస్తోంది. ఈ నేపథ్యంలో వాంగ్‌చుక్ సతీమణి చేసిన విన్నపం యావద్దేశాన్ని నిలదీస్తోంది. ఇది ఒక కుటుంబ వ్యక్తిగత వేదన కాదని, జాతి మనస్సాక్షికి పరీక్ష అని ఆమె స్పష్టం చేశారు. ఆమె మాటల్లోని సారం ఏమిటంటే -ఈ దీక్ష కేవలం ఒక మంత్రి రాజీనామాతో ముగిసిపోతే, ఒక అసాధారణ త్యాగాన్ని మామూలు రాజకీయ ఫలితంగా కుదించినట్లే! మంత్రులు వైఫల్యాలను అంగీకరించి తప్పుకునే నైతిక ధైర్యం ప్రదర్శించాల్సిందే. కానీ వ్యక్తులు తాత్కాలికం, వ్యవస్థలే శాశ్వతం. ఏ పార్టీ అధికారంలో ఉన్నా జవాబుదారీగా నిలిచేలా విద్యా భవిష్యత్తును నిర్వచించడమే అసలు అవసరం. పదిహేనేళ్ల క్రితం దేశ జనాభాలో సగంమంది 25 ఏళ్లలోపు వారే. దీన్ని 21వ శతాబ్దపు అపూర్వ అభివృద్ధి అవకాశంగా ఆర్థికవేత్తలు కీర్తించారు. కానీ విద్యలో ప్రవేశాలు పెరిగాయే తప్ప, అభ్యసనంలో పరివర్తన రాలేదు. మెరుగైన ఆలోచనాపరులు, వివేకవంతమైన నాయకులు, ఆవిష్కర్తలు, నైతిక వ్యాపారవేత్తలు, కరుణామయ పౌరులను తయారు చేసినప్పుడే జనసంఖ్యా లాభం సాకారమవుతుంది. అందుకే ఈ దీక్ష పార్టీలు, రాజకీయాలకు అతీతంగా విద్యా భవిష్యత్తుపై జాతీయ జాగృతికి ఉత్ప్రేరకం కావాలి.

ఆ జాగృతికి పునాదిగా పది తక్షణ సంస్కరణలను ఆమె దేశం ముందుంచారు. మొదటిది, పరీక్షా వ్యవస్థ ప్రక్షాళన. పరీక్షలు జ్ఞాపకశక్తికి పట్టంగడితే బడులు బట్టీ విద్యనే బోధిస్తాయి; ఆలోచనకు ప్రతిఫలమిస్తే ఆలోచనాపరులను తీర్చిదిద్దుతాయి. బోర్డు పరీక్షలనుంచి జేఈఈ, నీట్, యూపీఎస్సీ వరకు అన్నీ మూడేళ్లలోగా భావనల అవగాహన, సృజనాత్మకత, విశ్లేషణ, సమస్యా పరిష్కార సామర్థ్యాలను కొలిచేలా మారాలి. రెండోది, సమాంతర విద్యా వ్యవస్థగా అవతరించిన కోచింగ్ సంస్కృతి నిర్మూలన -బహుళ పరీక్షా అవకాశాలు, పాఠశాల ప్రతిభకు వెయిటేజీ ద్వారా అభ్యసనాన్ని బడులకు, బాల్యాన్ని పిల్లలకు తిరిగి అందించాలి. మూడోది, ప్రపంచ శ్రేష్ఠ ఉపాధ్యాయుల నిర్మాణం. ఏ విద్యా వ్యవస్థా తన ఉపాధ్యాయుల నాణ్యతను మించి ఎదగలేదన్నది ఫిన్లాండ్, సింగపూర్, జపాన్ అనుభవాలు చాటుతున్న సత్యం. నాలుగోది, అంగన్‌వాడీల నుంచి ఐఐటీల వరకు ప్రతి ఖాళీ పోస్టునూ మూడు నెలల్లోగా పారదర్శకంగా భర్తీ చేయడం. అయిదోది, ప్రతి డిగ్రీ విద్యార్థీ పట్టా పొందేలోగా అప్రెంటిస్‌షిప్, పరిశోధన, సామాజిక సేవవంటి వాటిలో ఒక సెమిస్టర్ పూర్తి చేయడం ద్వారా విద్యకు, సమాజానికి అనుసంధానం. ఆరోది, ప్రభుత్వ బడులపై విశ్వాస పునరుద్ధరణ. 13 ఏళ్ల వయసు వరకు ప్రతి బిడ్డకూ సమాన విద్య దక్కేలా మౌలిక వసతులు కనీస జాతీయ ప్రమాణాలుగా మారాలి. ఏడోది, విద్యా సంస్థలకు అకడమిక్ స్వేచ్ఛ. ప్రభుత్వాలు ఫలితాలను నిర్దేశించాలే తప్ప, బోధనలో మైక్రో మేనేజ్‌మెంట్ చేయకూడదు. ఎనిమిదోది, అభ్యసన ఫలితాలు, ఖాళీలు, ఉపాధి గణాంకాలను అందరూ పోల్చి చూడగల రియల్ టైమ్ జాతీయ విద్యా డాష్‌బోర్డ్. తొమ్మిదోది, విద్యపై ప్రజా వ్యయం జీడీపీలో కనీసం ఆరు శాతానికి, పరిశోధన నిధులు రెండు శాతానికి పెంపు. అన్నింటికంటే కీలకమైన పదోది -ప్రభుత్వాలు మారినప్పుడల్లా సంస్కరణలు మొదటికి రాకుండా, జాతీయ ప్రమాణాలను నిర్దేశించి, అమలును ఆడిట్ చేసి, ఫలితాలకు ప్రభుత్వాలను జవాబుదారీ చేసే స్వతంత్ర చట్టబద్ధ జాతీయ విద్యా సంస్కరణల కమిషన్ ఏర్పాటు.

నిజానికి ఈ పది సూత్రాల్లో ఏ ఒక్కటీ అసాధ్యమైనది కాదు; కావాల్సింది రాజకీయ సంకల్పమే. ప్రతి ప్రభుత్వమూ విద్యకు ఎంతోకొంత తోడ్పాటు అందించినా, పరిష్కారం కాని నిర్మాణాత్మక బలహీనతలను వారసత్వంగా పొందిందన్నదీ వాస్తవమే. అందుకే విద్య భారతదేశపు తొలి నిజమైన పక్షాతీత జాతీయ మిషన్‌గా అవతరించాలి. చరిత్ర ఏ జాతికైనా అందించే నిర్ణాయక ఘడియలు అరుదు.. ప్రజల దృష్టి, నైతిక సంకల్పం, రాజకీయ ఆవశ్యకత ఒక్కచోట కలిసే క్షణాలవి. వాంగ్‌చుక్ దీక్ష అటువంటి ఘడియను దేశం ముంగిట నిలిపింది. గాంధీజీ ఉపవాస దీక్షలు బ్రిటిష్ సామ్రాజ్యాన్నే కదిలించిన చరిత్ర మనది. మరి స్వతంత్ర భారతంలో ఒక విద్యావేత్త ప్రాణాలను పణంగాపెట్టి లేవనెత్తిన ప్రశ్నకు వ్యవస్థ ఇచ్చే సమాధానమేమిటి? పార్లమెంటు సమావేశాలు ఎప్పటిలాగే ముగుస్తాయి. కానీ ఈ ఏడాది ఒకటో తరగతిలో అడుగుపెడుతున్న చిన్నారి రేపు ఆవిష్కర్తగా ఎదుగుతాడా? అనుకరణదారుగా మిగులుతాడా? అన్నది నేడు మనం నిర్మించే విద్యపైనే ఆధారపడి ఉంటుంది. దేశం ముందున్న ప్రశ్న విద్యాశాఖను ఎవరు నడిపిస్తారన్నది కాదు; మన పిల్లలకు తగిన విద్యా వ్యవస్థను నిర్మించే దార్శనికత, సంకల్పం మనకున్నాయా అన్నదే. ఆ బాధ్యత ఏ ఒక్క ప్రభుత్వానిదో కాదు -విద్యే సకల జాతీయ ఆకాంక్షలకు పునాది అని నమ్మే ప్రతి పౌరుడిదీ. వాంగ్‌చుక్ దీక్ష ఆ ప్రస్థానానికి నాంది పలికితే, ఆయన త్యాగం ఒక జాతిని జాగృతం చేసిన చారిత్రక ఘట్టంగా నిలుస్తుంది. సంస్కరణ, పునరుద్ధరణ, పునరుజ్జీవనం -ఈ మూడింటి సమాహారమే నేటి భారత విద్యారంగానికి కావాల్సిన సంజీవని!

## పనికొచ్చే పలుకు



# కోపం ఖరీదు.. సంతోషం!

"నువ్వు కోపంగా గడిపే ప్రతి నిమిషం, నీ జీవితంలోని అరవై సెకన్ల సంతోషాన్ని కోల్పోతున్నట్లే" -ప్రఖ్యాత అమెరికన్ తత్వవేత్త రాల్ఫ్ వాల్డో ఎమర్సన్ మాట ఇది. నేటి ఆధునిక జీవనశైలికి అద్దంపట్టే హెచ్చరిక కూడా. జీవితమనేది ఎవరికైనా పరిమిత కాలమే. దాన్ని దేనితో నింపుతున్నామన్నదే అసలు ప్రశ్న. కోపానికి కేటాయించే ప్రతి క్షణమూ, సంతోషం ఖాతానుంచి చేసే ఖర్చే. ఆ లెక్క ఎప్పటికీ తిరిగి రాదు. కాలానికి రీఫండ్ ఉండదుగా.

మోడ్రన్ లైఫ్‌స్టయిల్‌లో కోపానికి కారణాలు అడుగడుగునా. ఉదయం లేవగానే ట్రాఫిక్ చిరాకు. ఆఫీసులో డెడ్‌లైన్ల ఒత్తిడి. బాస్ మాటలు, సహోద్యోగుల పోలికలు. ఇంటికొచ్చాక కుటుంబ బాధ్యతల భారం. ఇవి చాలవన్నట్లు -సోషల్ మీడియా తెరిస్తే చాలు, ఎవడో రాసిన కామెంట్, ఎవరిదో విజయాన్ని చూసి కలిగే అసహనం, రాజకీయ వాదనలు, ట్రోలింగ్‌లు.. ఇలా అరచేతిలోని ఫోనే ఆగ్రహానికి అగ్గిపెట్టెగా మారింది. నిమిషానికోసారి నోటిఫికేషన్లతో మెదడును ఉద్రేకపరిచే ఈ డిజిటల్ యుగంలో, ప్రశాంతత అనేది అరుదైన సంపదగా మారిపోయింది.

ఇక్కడ గమనించాల్సిన సూక్ష్మం ఒకటుంది. కోపం వచ్చినప్పుడు మనం శిక్షించేది ఎదుటివారిని కాదు.. మనల్ని మనమే! ట్రాఫిక్‌లో హారన్ మోగించి అరిచినంత మాత్రాన రోడ్డు ఖాళీ కాదు. కానీ మన రక్తపోటు మాత్రం సర్రున పెరుగుతుంది. ఆధునిక వైద్యశాస్త్రం కూడా ఇదే చెబుతోంది -నిరంతర ఆగ్రహం గుండె జబ్బులకు, నిద్రలేమికి, మానసిక ఆందోళనకు నేరుగా దారితీస్తుందని. అంటే కోపంవల్ల పోయేది సంతోషం మాత్రమే కాదు.. ఆరోగ్యం, ఆయుష్షు కూడా! "కోపం తెచ్చుకోవడమంటే -ఎదుటివాడు చేసిన తప్పుకు మనల్ని మనం శిక్షించుకోవడమే" అన్న పెద్దల మాటలోని ఆంతర్యమిదే.

మరో కోణం చూద్దాం. కోపంలో గడిపిన క్షణాల్లో మనం ఏం కోల్పోతున్నామో ఎప్పుడైనా ఆలోచించారా? పిల్లల నవ్వులు వినే క్షణాలు.. అమ్మ చేతి భోజనాన్ని ఆస్వాదించే తీరిక.. స్నేహితుడితో మనసారా మాట్లాడే సమయం.. సాయంత్రపు సూర్యాస్తమయాన్ని చూసే ఓపిక -ఇవన్నీ కోపమే మింగేస్తుంది. ఒక చిన్న వాట్సాప్ గొడవ మనసులో ఉంటే, ఎదురుగా ఉన్న అందమైన జీవితమంతా అంధకారమే. కోపమనే నల్ల కళ్లద్దాలు పెట్టుకుంటే, ప్రపంచమంతా చీకటే. అలాగని కోపమే రాకూడదని కాదు. అది సహజమైన భావోద్వేగం. కానీ అది వచ్చినప్పుడు దాన్ని ఎంతసేపు మోస్తున్నామన్నదే కీలకం! నిప్పు కణిక చేతిలో పడితే వెంటనే విదిలించేస్తాం. మరి కోపాన్ని మాత్రం గంటలు, రోజులు, కొన్నిసార్లు ఏళ్ల తరబడి గుండెల్లో మోస్తూ తిరుగుతామెందుకు? అందుకే మానసిక నిపుణులు కొన్ని చిన్న సూత్రాలు చెబుతారు. కోపం వచ్చినప్పుడు వెంటనే స్పందించకుండా పది లోతైన శ్వాసలు తీసుకోవడం, ఆ క్షణంలో ఫోన్ పక్కన పెట్టడం, నడకకు వెళ్లడం, "ఈ విషయం పదేళ్ల తర్వాత కూడా ఇంత ముఖ్యమేనా?" అని ప్రశ్నించుకోవడం -ఇవి సాధన చేస్తే ఆగ్రహం మీద అదుపు అలవడుతుంది. క్షమించడమంటే ఎదుటివారికి ఇచ్చే బహుమతి కాదు.. మనకు మనం ఇచ్చుకునే విముక్తి!

చివరగా ఒక్క మాట. జీవిత గడియారంలో ప్రతి సెకనూ ముందుకే కదులుతుంది, వెనక్కి కాదు. ఆ సెకన్లను కోపంతో నింపుతామా, సంతోషంతో నింపుతామా అన్నది పూర్తిగా మన చేతుల్లోని ఎంపిక. కోపం క్షణికం.. దానివల్ల కోల్పోయే ఆనందం శాశ్వతం. అందుకే ఆగ్రహం తలుపు తట్టినప్పుడల్లా ఎమర్సన్ మాటను గుర్తు చేసుకుందాం -ఈ నిమిషం కోపానికా, సంతోషానికా? ఎంపిక సరైనదైతే, జీవితమే ఒక పండుగ!


# నడినెత్తిన ఎల్‌నినో నీలినీడలు



తెలుగు రాష్ట్రాల నెత్తిన ఎల్‌నినో నీలినీడలు కమ్ముకుంటున్నాయి. జూన్‌లో సకాలంలోనే పలకరించిన నైరుతి రుతుపవనాలు.. తర్వాత ముఖం చాటేయడంతో, ఏపీ, తెలంగాణ రెండూ వర్షాభావ సంక్షోభం అంచున నిలిచాయి. జులై 16నాటికి తెలంగాణలో 35 శాతం వర్షపాతం లోటు నమోదవగా, రాష్ట్రంలోని 33 జిల్లాలకుగాను ఏకంగా 27 జిల్లాలు లోటు వర్షపాతంతో అల్లాడుతున్నాయి. సాధారణంగా ఈపాటికి 243.4 మిల్లీమీటర్ల వర్షం కురవాల్సి ఉండగా, కేవలం 159.1 మిల్లీమీటర్లే నమోదైంది. ఆంధ్రప్రదేశ్ పరిస్థితీ ఆందోళనకరమే. రాష్ట్రంలో ఇప్పటివరకు 25 శాతం వర్షపాతం లోటు నమోదవగా, పలు జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలు దాటుతున్నాయి. జలాశయాల దుస్థితి మరింత ఆందోళన రేపుతోంది. గోదావరి బేసిన్ ప్రాజెక్టుల్లో వినియోగార్హ నిల్వ 27.69 టీఎంసీకి, కృష్ణా బేసిన్‌లో 14.81 టీఎంసీకి పడిపోయింది. అందుబాటులో ఉన్న నీరు ప్రధానంగా తాగునీటి అవసరాలకే సరిపోతుందని, భారీ వరద వస్తే తప్ప సాగునీటి విడుదలకు ఆస్కారం లేదని అధికారులు చెబుతున్నారు. భూగర్భ జలాలదీ అదే దారి -గత ఏడాదితో పోలిస్తే జూన్‌లోనే 18 జిల్లాల్లో సగటు భూగర్భ జలమట్టాలు క్షీణించాయి. ఈ ప్రమాద సంకేతాలను గుర్తించిన ప్రభుత్వాలు అప్రమత్తమయ్యాయన్నది సానుకూలాంశం. కరవు పరిస్థితులను ఎదుర్కొనేందుకు తెలంగాణ మంత్రివర్గం ఖరీఫ్ సీజన్‌కు వ్యవసాయ ఆకస్మిక ప్రణాళిక సిద్ధం చేస్తోంది. తక్కువ నీరు అవసరమయ్యే పంటలవైపు రైతులను మళ్లించడం, స్వల్పకాలిక, కరవు తట్టుకునే వంగడాలను ప్రోత్సహించడం, పప్పుధాన్యాలు, నూనెగింజలు, చిరుధాన్యాల సాగును విస్తరించడం, జిల్లాలవారీ ప్రత్యామ్నాయ పంట సిఫార్సులు, ఎల్‌నినో ప్రభావాన్ని తగ్గించే యాజమాన్య పద్ధతులు ఇందులో భాగం కానున్నాయి. తాగునీటికి ఎలాంటి ఇబ్బందీ రాకుండా స్థానిక వనరుల ఆధారంగా అన్ని నివాస ప్రాంతాలకు నీటి సరఫరా వ్యవస్థలను సన్నద్ధం చేస్తున్నారు. బలహీన ప్రాంతాల్లో భూగర్భజల ఆధారిత పథకాల వినియోగంపై కార్యాచరణ రూపొందిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సైతం జలవనరుల పరిరక్షణ, ప్రత్యామ్నాయ పంటల ప్రణాళిక, రైతు భరోసా చర్యలపై దృష్టి సారించింది. కేంద్ర స్థాయిలో -తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సహా పలు రాష్ట్రాల్లోని 315 జిల్లాల్లో కరవు ఆకస్మిక ప్రణాళికలను కేంద్ర ప్రభుత్వం క్రియాశీలం చేసింది. సంక్షోభం తలుపు తట్టకముందే సన్నద్ధత ప్రారంభం కావడం ముదావహమే అయినా, ప్రణాళికలు కాగితాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో వేగంగా అమలు కావడమే అసలు పరీక్ష.

ఈ సంక్షోభం వెనుక ఉన్న శాస్త్రీయ వాస్తవాలను అర్థం చేసుకుంటేనే సమస్య తీవ్రత బోధపడుతుంది. ప్రతి రెండు నుంచి ఏడేళ్లకోసారి పసిఫిక్ మహాసముద్రంలో సంభవించే ఎల్‌నినో, ప్రపంచవ్యాప్తంగా భారీ వర్షాలు, కరవులు, ఉష్ణ ప్రకోపాలను ప్రేరేపిస్తుంది. ఈ ఏడాది మిగిలిన కాలంలో ఎల్‌నినో ప్రభావం 90 శాతం వరకు కొనసాగే అవకాశం ఉందని ప్రపంచ వాతావరణ సంస్థ అంచనా. సాధారణ పరిస్థితుల్లో వ్యాపార పవనాలు వెచ్చని సముద్ర జలాలను పశ్చిమ పసిఫిక్‌వైపు నెడతాయి. ఎల్‌నినో బలపడినప్పుడు ఆ పవనాలు బలహీనపడటమో, వెనక్కి మళ్లడమో జరిగి, వేడినీరు అమెరికా ఖండాలవైపు ప్రవహిస్తుంది. మధ్య, తూర్పు పసిఫిక్ ఉపరితల ఉష్ణోగ్రతలు సగటు కంటే రెండు డిగ్రీలకు మించి పెరిగితే దాన్ని 'సూపర్' స్థాయిగా పరిగణిస్తారు. ఇది భారత నైరుతి రుతుపవనాలను బలహీనపరుస్తుంది. ఎల్‌నినో పరిస్థితుల కారణంగా ఈ ఏడాది దేశంలో రుతుపవన వర్షపాతం దీర్ఘకాలిక సగటులో 90 శాతమే ఉంటుందని భారత వాతావరణ శాఖ అంచనా వేసింది. దేశ వార్షిక వర్షపాతంలో 70 శాతం రుతుపవనాల నుంచే లభిస్తుంది. సగం సాగుభూమికి నీటిపారుదల సదుపాయం లేని, జనాభాలో సగంమంది వ్యవసాయంపైనే ఆధారపడిన మన దేశానికి ఇది ఎంత కీలకమో వేరే చెప్పనక్కర్లేదు. ఇక్కడ మరో సూక్ష్మం ఉంది -హిందూ మహాసముద్ర ద్విధ్రువత (ఐవోడీ) సానుకూలంగా ఉంటే తేమ గాలులను భారత ఉపఖండం వైపు లాగి రుతుపవనాలకు ఊతమిస్తుంది. కానీ ఎల్‌నినో సాధారణంగా ఐవోడీ కంటే శక్తిమంతమైనది కావడంతో, దాని ప్రతికూలతను ఐవోడీ పాక్షికంగానే సరిదిద్దగలదు. అసలే మానవ కార్యకలాపాలతో కర్బన ఉద్గారాలు కట్టుతప్పి భూగోళం వేడెక్కుతున్న వేళ, సముద్రం నుంచి వాతావరణానికి ఉష్ణశక్తిని భారీగా బదిలీ చేసే ఎల్‌నినో ఆ మంటకు ఆజ్యం పోస్తోంది. 2023-24 నాటి ఎల్‌నినో ధాటికి పారిస్ ఒప్పంద పరిమితి అయిన 1.5 డిగ్రీల సెంటీగ్రేడ్‌ను దాటిన తొలి సంవత్సరంగా 2024 నిలిచింది. ప్రస్తుత ఎల్‌నినో ప్రభావంతో 2027లో రికార్డుస్థాయి ఉష్ణోగ్రతలు నమోదు కావచ్చని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. ఐరోపాను కుదిపేస్తున్న వడగాడ్పులు ఇప్పటికే 1,300 మందికి పైగా ప్రాణాలను బలిగొనడం ఆ హెచ్చరికల తీవ్రతకు తార్కాణం. ఆర్థిక కోణంలోనూ ఎల్‌నినో దెబ్బ చిన్నది కాదు. ఆహార ధాన్యాల ప్రధాన ఎగుమతి ప్రాంతాల్లో కరవులను ప్రేరేపించి, పంట దిగుబడులను తగ్గించి, వ్యవసాయ సరఫరా గొలుసులను ఛిన్నాభిన్నం చేసి ఆహార ద్రవ్యోల్బణాన్ని ఎగదోస్తుంది. బలహీన రుతుపవన అంచనాల నేపథ్యంలో భారత జీడీపీ వృద్ధి రేటు 7.7 శాతంనుంచి 6.6 శాతానికి తగ్గవచ్చని ఎస్ అండ్ పీ గ్లోబల్ రేటింగ్స్ అంచనా వేయడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. వర్షాలు మురిపిస్తేనే పల్లె పులకరిస్తుంది, దేశ ఆర్థిక రథం పరుగులు తీస్తుంది. వాన కరవైతే ఆ ప్రభావం పొలం గట్టు నుంచి స్టాక్ మార్కెట్ దాకా ప్రతిచోటా ప్రతిధ్వనిస్తుంది.

విపత్తు ముంగిట ప్రభుత్వాలు బాధ్యతగా వ్యవహరిస్తే నష్టాన్ని గణనీయంగా నివారించొచ్చు. ప్రణాళికలతోపాటు అమలులో వేగం, పారదర్శకత అత్యవసరం. కరవును తట్టుకునే స్వల్పకాలిక విత్తనాలను రైతులకు సకాలంలో, సబ్సిడీపై అందుబాటులో ఉంచాలి. బోరుబావులపై ఒత్తిడి పెరగకుండా బిందు, తుంపర సేద్యం వంటి సూక్ష్మ నీటిపారుదల విధానాలను యుద్ధప్రాతిపదికన విస్తరించాలి. చెరువులు, కుంటల పూడికతీత, వాననీటి సంరక్షణ పనులను ఉపాధి హామీ పథకంతో అనుసంధానించి గ్రామీణ కూలీలకు పని కల్పించడంతోపాటు జల సంరక్షణనూ సాధించాలి. పంటల బీమా పరిహారం సకాలంలో అందేలా యంత్రాంగాన్ని సన్నద్ధం చేయాలి. పశుగ్రాసం, తాగునీటి ట్యాంకర్ల ఏర్పాట్లను ముందుగానే సిద్ధం చేసుకోవాలి. వాతావరణ ముందస్తు హెచ్చరికలను గ్రామస్థాయి రైతుల చెంతకు చేర్చే డిజిటల్ వ్యవస్థలను బలోపేతం చేయాలి. కృష్ణా, గోదావరి జలాల విషయంలో రెండు తెలుగు రాష్ట్రాలూ వివాదాలను పక్కనపెట్టి, అందుబాటులో ఉన్న ప్రతి నీటిబొట్టునూ సమన్వయంతో వాడుకోవడం ఈ క్లిష్ట సమయంలో అత్యంత కీలకం. ఎల్‌నినో వంటి ప్రకృతి వైపరీత్యాలను మనం ఆపలేకపోవచ్చు. కానీ దుష్ప్రభావాన్ని తగ్గించడం ఖచ్చితంగా మన చేతుల్లోనే ఉంది. ఆధునిక విజ్ఞానం వాన రాకడను ముందే పసిగట్టే శక్తిని మనకు అందించింది. ఆ హెచ్చరికలను పాలకులు ఎంత చిత్తశుద్ధితో కార్యాచరణగా మలుస్తారన్న దానిపైనే కోట్లాది రైతన్నల భవితవ్యం ఆధారపడి ఉంది. వరుణుడు పెట్టిన ఈ పరీక్షలో తెలుగు రాష్ట్రాలు నెగ్గాలంటే -ముందుచూపు, సమన్వయం, వేగవంతమైన అమలు అనే మూడు అస్త్రాలే శరణ్యం! ■




జీవితంలో చాలా విషయాలు నేర్చుకోవడం సులభమే కానీ, వాటిలో నైపుణ్యం సాధించడమే కష్టం. ఆ నైపుణ్యానికి అడ్డుకట్ట వేసేది జ్ఞాన లోపం కాదు. పనితనం, పట్టుదల లోపించడం. ప్రతిభావంతులకు ఏం చేయాలో బాగా తెలిసినా.. ఆ పనిని సరిగ్గా చేయరు, లేదా కొన్నాళ్లు చేసి మధ్యలోనే వదిలేస్తుంటారు. నిరంతర సాధన మాత్రమే మిమ్మల్ని అందరి కంటే ఉత్తములుగా మారుస్తుంది.

*నీటి బొట్టు బండరాయిని చీల్చేది బలంతో కాదు..*
*నిరంతరాయంగా పడటం వల్లే. అలుపెరగని అభ్యాసమే..*
*అసాధ్యాన్ని సుసాధ్యం చేసే అస్త్రం.*

-మహాదేవ

## వింతల్లో వింతలు

# దోమల వేటకూ డ్రోన్లు!



దోమల బెడదనుంచి విముక్తికి అమెరికా స్టార్టప్ ఒకటి వినూత్న పరిష్కారం కనుగొంది. వై కాంబినేటర్ మద్దతున్న 'టోర్నియోల్' అనే స్టార్టప్ ఇంజినీర్లు, ఏఐ సాయంతో పనిచేసే మైక్రో డ్రోన్లను అభివృద్ధి చేస్తున్నారు. గాల్లో ఎగురుతున్న దోమలను గుర్తించి, అక్కడికక్కడే కూల్చేయడం వీటి ప్రత్యేకత. రసాయనాలతో పోలిస్తే దోమల నిర్మూలన ఖర్చును ఇవి వంద రెట్లు తగ్గిస్తాయని సంస్థ చెబుతోంది. తాజాగా సంస్థ వ్యవస్థాపకుడు అలెక్స్ టౌసెంట్ ఓ వీడియోను విడుదల చేశారు. అందులో చిన్న డ్రోన్ ఒక చిమ్మటను వెంటాడి మరీ కూల్చేసింది. దీన్ని తమ తొలి "ఎయిర్-టు-ఎయిర్ కిల్"గా ఆయన అభివర్ణించారు. కేవలం 40 గ్రాముల బరువుండే ఈ డ్రోన్లు అల్ట్రాసోనిక్ సెన్సర్లు, మైక్రోఫోన్ల ద్వారా దోమ రెక్కల ప్రత్యేక శబ్దాన్ని పసిగట్టి, ఇతర కీటకాల నుంచి వాటిని వేరు చేయగలవు. కేవలం పది డ్రోన్లతో ఒక చదరపు కిలోమీటర్ ప్రాంతాన్ని దోమల రహితంగా మార్చాలన్నది సంస్థ లక్ష్యం. ప్రయోగాలు విజయవంతమైతే, నగరాల్లో దోమల యుద్ధానికి ఇక డ్రోన్ సైన్యమే సమాధానం కానుంది!

